# ‘చీకటి’ ఘోష

రచన: మూర్తి

లోపలనుంచీ ఏదో బాధ నాలో పరిగెట్టుకుని వస్తూంది. ఇంకేం వ్రాయలేను...

అన్నంలేకుండా ఎన్నోరాత్రిళ్లు... నేనూ, మీ వదినా అలాగే ఉంటున్నాం. బాబాయికి చొక్కాలు చిరిగిపోయాయి. వాడు కొత్త చొక్కాకోసం ఒకటేపోరు......కాని ఏం చేయను? దరిద్రులం—'

'అబ్బ!...ఏదోబాధ—ఇలాంటి నిర్భాగ్యులు యెంతమందున్నారో ఈ ప్రపంచంలో....., మరి వస్తా!'

మా అన్నయ్య వ్రాసిన ఈ ఉత్తరం మళ్ళీ చదివాను. రాత్రి 10 గంటలయింది. ఉత్తరాన్నిగురించి ఆలోచిస్తూనే పక్క వేసుకొన్నాను గదిలో 'ఏదో! ఎవళ్ళకర్మం వాళ్ళది. అనుభవించాలి మరి...ఈ ప్రపంచంలో అందరూ దరిద్రులే ఉంటారా' అనుకొన్నాను.

గదిలో నేనొక్కణ్ణే పడుకున్నాను. ఎంత ప్రయత్నించినా నిద్దరపట్టడంలేదు. నడిరాత్రి కారుచీకటి. కిటికీతలుపులు లోనుంచి గాలి రివ్వుమనివీస్తూ ఊరికేరొదలు పెడుతూంది.

'ఇంతటిలోకే నా గదితలుపు తోసుకొనివచ్చి ఒక యువతి నాదగ్గిరకి వచ్చింది. నాపక్క దగ్గిరకి సమీపించింది. మాటలాడనయినా లేదు కాని అప్పుడే చటుక్కుని నా జెబ్బ గట్టిగా పట్టుకుంది.

ఆమె అంత భయంకరంగాలేదు కాని, నల్లగానే ఉంది. నల్లని పొగలు క్రక్కే ఆకాశంలాంటి చీర ధరించింది; రవికకూడా అలాంటి రంగుదే. పొడుగాటిజుట్టు; ఉంగరాలు ఉంగరాలుగా మెడమీదనుంచి క్రిందకి జారుతున్నాయి కుంతలాలు; విరబోసుకొన్నజుట్టు తాటిచెట్ల తలలమీద మూగ్లే జీమూతంలా అవుపించింది. కళ్లుమాత్రము నిప్పుకణాల్లా యెర్రగా వున్నాయి.

పడుకొన్నవాణ్ణికూర్చోబెట్టింది నేను వణికిపోయాను. ఎలాగో ధైర్యం తెచ్చుకొని 'నీపేరు చెప్పు' అని అడిగాను. ఆమె నాదెబ్బ వదిలేసి వికటంగా పెద్ద నవ్వు నవ్వింది. చీకటిలో కీచురాళ్ళ ఘోషలా వినిపించింది ఆ నవ్వు. కనుబొమ్మలు ముడిచి 'నాపేరు నీకు కావాలా?... అవుతే విను—నాపేరేనా!...'చీకటి' అంటారు నన్ను...' అని మరీ వికృతంగా నవ్వుతూ '' 'చీకటి' నాపేరు'' అని భీభత్సంగా అంది.

కిటికీలోంచి దూరాన్నుంచి కూస్తూన్న గుడ్లగూబ కూత వినపడింది. అప్పుడు గుడ్లగూబ కళ్లల్లా ఆమెకళ్లు మండే నిప్పులా ఉన్నాయి.

'రా—నాతో రా!...రావేం?' అని నాజెబ్బ మళ్ళీ గట్టిగా పట్టుకుంది. పక్కమీద అలాగే కూర్చున్నాను; తీక్షణంగా చూసింది. నేను ఒక నిముషానికి పక్కమీదలేను. 'రా...నాతో రా!......' అంది......ఆమె చేయి నాజెబ్బని గట్టిగా పట్టుకొనే ఉంది; ఆమె నాలుగడుగులు చరచరా నడిచింది... నాకప్పుడు స్మృతిఉందో లేదో చెప్పలేను. భయంవేసింది ఒళ్ళంతా కంపించిపోయింది నిలువునా. నోట మాటరాలేదు. 'భయం—లేదు. నాతో వస్తున్నావా?...రా' అన్న మాటలు నాకు వినబడుతూ వస్తున్నాయి తఱుచుగా.

* * *

అంతే—అలా నడిచిపోతూంది ఆమె. ఆమె చేయి నా జెబ్బమీదనే ఉంది; మాట్లాడినప్పుడు కీచురాళ్ళ మ్రోతలా గింగురు మంటూంది. విశాలబయలులో దగ్గిర దగ్గిరగా ఎర్రని మంటలు కనిపిస్తున్నాయి. ఆ మంటల్లోనే 'చిట్-ఫట్-ఫట్' మని ఏవో పేలిపోతున్నాయి. భీకరంగాఉంది. అక్కడక్కడ గుడ్లగూబలు అరుస్తున్నాయి. ఏదోఘోష ఆప్రదేశం నిండా మార్మ్రోగి పోతూంది! అంత భీభత్సమయిన దృశ్యం నేనెప్పుడూ చూడలేదంతవరకూ నేను ఒకసారి వెనక్కి తిరిగి కళ్లుగట్టిగా మూసుకొన్నాను భయంచేత. ఆమె 'కళ్లుతెరువు' అని గద్దించింది.

'ఇదేమిటో తెలుసునా?' అంది. నేనేం మాట్లాడలేను. ఆమె:

'చూడు! ఇది దరిద్రుల శ్మశానం కష్టపడి పనిచేసినా అన్నం దొరక్క అల్లాడిన వారి

చితిమంటలు. ఎన్ని వేలు ఉన్నాయో చూశావా! ఇవి ఈకాలంలోని క్షుత్ బాధాపీడితులవి. వీళ్ళ కళేబరాలని తగ లెయ్యడానికేనా ఎవరూ రాలేదు-నేనే కొన్నింటిని తగలేశా. కొన్ని, గ్రద్దలకీ, నక్కలకీ, ఆహారము అయాయి... ఆమె ఏదో ఇంకా చెపుతూంది. నేను చెవులు మూసుకున్నాను

మరి కొంతదూరం సాగిపోయాం; అక్కడ-

ఎన్నోయెండలకి యెండిపోయి నుసి అయిపోయిన తాటాకుముక్కల పొల్లుతోనిండిన ప్రదేశములో రెండు మట్టిగోడలు; పాతబడినవీ శిథిలమైపోతూన్నవీను. కాలిపోయి నల్లగా మసిబారిన అడ్డదూలాలు; భూగర్భంలో కలిసిపోతూన్న కుండముక్కలు; విరిపోయిన నులకమంచం-చివికిపోయిన దాని పట్టెడ; మాసిపోయి మాగుళ్ళు గట్టిన గుడ్డముక్కలు; ఇవి ఉన్నాయక్కడ. మేము లోపలికి వెళ్ళలేదు. పైకి కనిపించాయి ఇవి. పెద్దపెద్ద మూల్గులు వినబడుతున్నాయి; కొంచెం దగ్గుకూడా. క్రమక్రమముగా ఆ మూల్గులు పెద్దవయాయి.

ఆమె ఇలా అంది: 'ఈ మూల్గులు యెవరూ వినరు. క్షయరోగంతో కృంగి, కృశించి బలి అయిపోయిన దరిద్రుల కుటీరాలుండే చోటు ఇది. చూడీ నిర్భాగ్యునికొంప చెమటూడ్చి న్యాయంగా పనిచేశాడు, కాని ఆకలి! గడ్డురోగాలు! అతని ఊపిరి తిత్తులలోంచి వచ్చే మూల్గు ఇంకా చావలేదు అతను చచ్చినా, నీకు వినబడుతూందా ఆమూల్గు? ఆమూల్గూ, ఆదగ్గూ, ఈ ప్రదేశంనిండా యింతవరకూ పోషిస్తున్నాయి. నీజాతిలో గతించిన వారిలో దరిద్రులు శోకించిన స్థలం ఇది. వాళ్లు విడిచినవి ఉట్టి కన్నీళ్లు కావు; కష్టపడిన శ్రమించి ఆర్జించిన రక్తధారలు!, ఆ చివరిమాటలు కీచురాళ్ళ మోతలో లీన మయాయి.

కొంతసేపటికి—మరొక చోటు...

శిథిలమైపోతున్న మట్టి అరుగులు – దానికి అంటి ఉన్న పూరిళ్ళు-అన్నీ పాడయినవే. ఏవో పాటలు వినవస్తున్నాయి. నే నిదేమిటనుకొన్నారు ఆశ్చర్యపోయి. వాడిపోయిన పువ్వులు అక్కడక్కడ పడి ఉన్నాయి. బ్రద్దలయిన పిల్లనగ్రోవులూ, వెదురుగొట్టాలూ, ఎర్రపూసల పేర్లూ ఉన్నాయి. అక్కడక్కడ బంగారపు గాజులూ-నగలూ కనుపించాయి. మరి కొన్ని చోట్ల చిరిగిన రంగుచీరలూ గాజుముక్కలూ దొర్లుతున్నాయి.

ఆమె మళ్ళీ ప్రారంభించింది. 'దరిద్రుల స్త్రీజాతి యెంతెలా పాడయిందో, ధనవంతులు డబ్బుయిచ్చి వాళ్ళ శరీరాలని అన్యాయంగా దోచుకొన్నారు. పాపం! తిండిలేని ఆస్త్రీలు ధనానికి మానాన్ని ఆహుతి చేసుకొన్నారు. అవిగో...ఆబంగారపు నగలు అవే...

'ఇంక కొంతమంది దరిద్రుల కూతుళ్లు వాళ్లకంటె కొంస్త ధనవంతులని ప్రేమించేవారు; పాపం-వాళ్లు పెళ్ళాడేవారు కారు. డబ్బునే డబ్బుతోవచ్చిన స్త్రీనే పెళ్ళాడేవారు; హృదయము ఇచ్చినా దరిద్రులని అంగీకరించేవారు కారు పెళ్ళాడ్డానికి. వాళ్ల ప్రియులకోసము ఈ పేదకన్నెలు వెన్నెల రాత్రిళ్ళల్లో వలపుతో

8-వ వారము

.... శ్రీరామబాల గానవినోదసభ..........

తిరుమళిశై ఆళ్వార్

దినసరి నాటకం

న్యూ థియేటర్సులో

మౌంట్‌రోడ్డు పోస్టుఆఫీసు ఎదుట.

P.S.M.Co

పాడేవారు పాటలు. వాళ్ళకోరిక తీరకుండానే భూగర్భంలో వాళ్లు కలిసిపోయారు. వాళ్ల గానం మాత్రము ఇంకా ఉంది ఇక్కడ. ఈ ప్రాంతాల్లో వారి పాటలు ఇంకా పిలుస్తున్నాయి ప్రియులకోసం. అమాయకులు, ఎంత దుస్థితి! పువ్వులూ, వెదురుగొట్టాలూ ఇచ్చేవారు ప్రియులికి. వాళ్ల హృదయాల భగ్నంతో బ్రద్దలయిపోయాయి. ఇంకా వాళ్ళ వెదురుగొట్టాలు యెలా పడిఉన్నాయో చూడు.'

ఆమె కంఠం రుద్ధమైపోయింది చివరికి. ఇలాగే ఎన్నో దరిద్రుల దృశ్యాలని చూసి చూసి మరొకచోటికి పోయాం.

అక్కడ అంతా కారుచీకటి, అది మూలుగుతూంది ఊరికే. ఏవో పక్షులు భయంకరంగా ఘోషిస్తున్నాయి. ఎదురుగుండా యెర్రని రంగు గలనది పొంగి పొర్లుతూంది. దూరాన్నిఉన్న చెట్లు నల్లని తెరల్లా అవుపిస్తున్నాయి. మధ్య మధ్య ఎక్కడో మిణుగురు పురుగు ఒకొక్కప్పుడు గబుక్కుమని వెలిగి మళ్లీ చీకటిలో కలిసిపోతూంది. ఒక చెట్టుక్రింద ఆమె నిల్చుంది, నాజెబ్బని వదిలేసింది.

నాకేసి చూసి ఇలా అంది 'అనదేమిటో తెలుసునా? ఇంతవరకూ నీజాతిలోఉన్న మానవుల్లో ఆకలిచే, దరిద్రంచే మృత్యుదంష్ట్రిలకి ఆహుతి అయిన పేదలరక్తం! ఇది సముద్రంలా ఘోషించడంలేదూ? వింటున్నావా యీ ఘోషని? ఎంత యెరుపో యీ దరిద్రులరక్తం! చీకటి అంటే నల్లని రాత్రి అనేకాదు. గతించిన యుగాలలోని విషాదచరిత్రని చాటే గాయకి. నీ పూర్వులలో దరిద్రులు బాధలతో యెంత శోకించారో చెప్పేది-వెనకటి కాలంలో అభాగుల కళ్లల్లోంచి స్రవించే రక్తాన్ని చూపించేది-చీకటి... తెలుసా?' అని ఆమె ఉద్రేకముతో అంది.

'ఝుంయ్' మని వీచేతుఫానుగాలి చెట్ల రెమ్మల్ని దూసుకొనివస్తూ ఏదోమూగగా ఘోషించింది. దరిద్రుల రక్తస్రవంతి మహావేగంతో పరుగులు పెడుతూంది. ఆమె సాగిపోతూనే ఉంది. కాని ఆ చీకటిలో ...ఏమిటో!




# రీటా

## తలవెండ్రుకలను పెంచును

రీటా కురుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్ట తల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు, మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

**రీటా హిందూదేశమంతటా దొరకును. వెల సీసా 15 అణాలు.**